క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల నిరసన



కొండపల్లి (ఇబ్రహీంపట్నం): స్థానిక ఈఎస్ఐ వైద్యశాల కార్మికుల ప్రయోజనం కోసం రెండు షిఫ్టులు కొనసాగాలని మున్సిపల్ కార్మికులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ వైద్యశాల 3.00 గంటలకు మూసివేయడం వలన పనులు ముగించుకుని ఇళ్లకు చేరే కార్మికులకు వైద్య సేవలు అందుబాటులో లేవన్నారు. ఈ ప్రాంతంలో ఎన్టీటీపీఎస్, మున్సిపాలిటీ, ఐడీఏ తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో కార్మికులు ఉన్నందున రెండు షిఫ్టులు నిర్వహించి సౌకర్యాలు పెంచాలన్నారు. కార్మికుల సౌకర్యార్థం ఇటీవల కాలంలో నిర్మించిన నూతన భవనంలోకి మార్చాలని డాక్టర్‌ను కోరారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి కార్మికుడికి గాయాలు

జి.కొండూరు: ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభంపై నుంచి పడిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్తే..జి.కొండూరు నుంచి వెలగలేరులోని జగనన్న కాలనీ లే అవుట్‌కి 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు విద్యుశాఖ అధికారులు ఇటీవల పనులు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో జి.కొండూరులో విద్యుత్ స్తంభంపైన కేబుల్‌ను లాగుతున్న కార్మికుడు కావాసి మనోజ్ ప్రమాదశాత్తూ జారి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడుకి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు మనోజ్ చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, రామాపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా తోటి కార్మికులు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ముసునూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు అమలు చేస్తున్నామని ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో మొక్కజొన్న కొనుగోళ్లు వేగంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఏడు ట్రాక్టర్లను రైతులకు అందజేశామన్నారు. ఆర్‌బీకేల్లో జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు 50 శాతం రాయితీపై రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చిత్తశుద్ధితో కృషి కొనసాగిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ తెలిపారు. ఇటీవల డాక్టరేట్ స్వీకరించిన జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్‌ను ఎంపీపీ రావర్ల కృష్ణకుమారి దంపతులు, వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, పి.గంగాధర్, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ శాలువలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. సర్పంచ్‌లు ఎంపీటీసీలు, ఏఈలు నరసింహ, సత్యప్రసాద్, ఏఓ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ సత్యనారాయణ తదితరులు జెడ్పీటీసీని అభినందించారు.

మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



మండల సమాఖ్య నూతన పాలకవర్గ సభ్యులతో ఏపీఎం రామకృష్ణ

ఆగిరిపల్లి: మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ఏపీఎం బొలగాని రామకృష్ణ తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల మహిళా సమైఖ్య మహాజన సభ సమావేశం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా చిన్ని పద్మావతి (సింగన్నగూడెం), ఉపాధ్యక్షురాలిగా కోట పుష్ప (ఈదర), కార్యదర్శిగా నక్కా రాజేశ్వరి (కృష్ణవరం), ఉప కార్యదర్శిగా పొనుగుమాటి సుమతి (నరసింగపాలెం), కోశాధికారిగా షేక్ మున్నీ (ఆగిరిపల్లి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలను చదివి వినిపించారు. సమావేశంలో మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు పామర్తి దేవి దుర్గాభవాని, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి

నందిగామ: డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏసీపీ జనార్ధన నాయుడు సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్‌కు సంబంధించిన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు తదితర అంశాల గురించి ప్రత్యేకంగా చర్చించారు.

నిస్వార్ధ సేవకులు వలంటీర్లు

- తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి
- గంపలగూడెంలో వలంటీర్లకు పురస్కారాల ప్రదానం



గంపలగూడెంలో పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

గంపలగూడెం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను చేరవేయడంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య నిస్వార్థంగా, చిత్తశుద్ధితో వలంటీర్లు పనిచేస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం మండలంలోని వలంటీర్లకు పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతం ప్రభుత్వాల హయాంలో వేళ్లానుకొన్న లంచగొండితనం, అవినీతిని ప్రక్షాళన చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీ వ్యవస్థను అమల్లోకి తెచ్చారన్నారు. వలంటీర్లు ప్రజల అభిమాన్ని చురగొన్నారన్నారు. ప్రజలు ఏదైనా సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఇంతకు మునుపు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అనేక పర్యాయాలు ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ఆవిధానాలకు స్వస్తిపలికి వలంటీర్లే ప్రజల ఇళ్ల వద్దకు వచ్చి దరఖాస్తు చేయిస్తున్నారన్నారు. భవిష్యత్తులో వలంటీర్లు మరింత మెరుగైన సేవల్ని అందజేస్తూ ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా వలంటీర్లు చూడాలన్నారు. మండలంలో సేవా రత్నకు ఎంపికైన ఐదుగురితోపాటు 294 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలను శాలువా కప్పి అందజేశారు. ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి అధ్యక్షతన కార్యక్రమంలో ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, వైస్ ఎంపీపీ పీ రజని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు కొత్తగుండ్ల నరశింహారావు, మాజీ ఎంపీపీ కోట దాసు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జీ చెన్నకేశవరెడ్డి, ఆలపాటి ఉమా, సీహెచ్ నర్సారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

- తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి
- గంపలగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

గంపలగూడెం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా గడప గడపకూ సంక్షేమ ఫలాలను అందుతున్నాయని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం-2 సచివాలయం పరిధి ఎమ్మెల్యే గడప గడపకూ మనప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేయడంలో రాష్ట్రం ముందంజలో ఉందన్న విషయం ప్రజలు గ్రహించాలన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలంటే 2024 ఎన్నికల్లో ఓటర్లు మరో పర్యాయం వైఎస్సార్ సీపీని బలపర్చాలన్నారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెల్సుకొన్నారు. అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందకపోతే వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల లబ్ధిదార్లకు వివరాల బ్రోచర్లను అందజేశారు. కాలనీ గృహాలు మంజూరు చేయాలని, అంతర్గత రహదార్ల అభివృద్ధి పర్చాలంటూ పలువురు ఎమ్మెల్యేను కోరారు. నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ జీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కే శామ్యూల్, ఎంపీటీసీ సభ్యులు పీ రజనీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, పట్టణశాఖ అధ్యక్షులు కొత్తగుండ్ల నరశింహారావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జీ చెన్నకేశవరెడ్డి, సీహెచ్ నర్సారెడ్డి, కొత్తగుండ్ల వంశీ, మాజీ ఎంపీపీ కే దాసు, మాజీ సర్పంచ్ కోట కోటేశ్వరరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లు కృష్ణారెడ్డి, నాయకులు ఆడెపు శ్రీనివాసాచారి, కోట సునీల, కో-ఆప్షన్ సభ్యులు షేక్ కరీమ్ పాల్గొన్నారు.

విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించాలి



మైలవరంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న టెక్నీషియన్ శ్యామ్‌సుందరరావు

నూజివీడు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు రావడం అలవర్చుకోవాలని గొల్లపల్లి గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మండలంలోని గొల్లపల్లిలో ఉన్న శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులతో యోగా అభ్యాసనం చేయించారు. యోగా వల్ల మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. వందలాది విజ్ఞాన, కథలు, మహనీయుల చరిత్రను తెలిపే పుస్తకాలున్నాయని తెలిపారు. వీటిని చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు

మైలవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో శుక్రవారం విద్యార్థులకు 'ఆశపోతు అవ్వ' కథల పుస్తకం చదివించి, చెప్పించారు. అనంతరం డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ విజన్ టెక్నీషియన్ శ్యామ్‌సుందరరావు విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి జబ్బుల గురించి, కంటి చూపు జాగ్రతల గురించి టెక్నీషియన్ వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణమస్తు నగదు పంపిణీ



లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న పాలకవర్గ సభ్యులు

చాట్రాయి: కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో పాల ఉత్పతిదారుల పిల్లల వివాహానికి అమలు చేస్తున్న కల్యాణమస్తు పథకం నగదు లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. పోతనపల్లి, కొత్తగూడెం, బూరుగుగూడెం గ్రామాల్లోని లబ్ధిదారులకు రూ.20 వేలు పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు అందించారు. కార్యక్రమంలో తిరువూరు పాలశీతల కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం నరశింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'చిన్నారి భవిత'



తల్లులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న సర్పంచి అప్పిరెడ్డి, తదితరులు

చాట్రాయి: నూజివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చాట్రాయి మండలం ఆరుగొలనుపేట, చీపురుగూడెం, తుమ్మగూడెం గ్రామాల్లో శుక్రవారం 'చిన్నారి భవిత' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులకు పోషకాహారం కిట్లు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆరుగొలనుపేట గ్రామ సర్పంచి పుచ్చకాయల అప్పిరెడ్డి, చీపరుగూడెంలో వైఎస్సార్ సీపీ నాయకుల ఓబిళ్లనేని వసంతరావు, చాట్రాయి సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల జ్యోతి, కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం



కోడూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: మండలంలోని కోడూరు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రక్షణనిధి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రభుత్వ పథకాలు మంజూరు చేసేందుకు గ్రామ సచివాలయాల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు సచివాలయాల సిబ్బంది అందుబాటులో ఉండి వారికి అవసరమైన పథకాలు మంజూరు చేయించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచి తేల్లూరి సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆత్తునూరు వెంకటరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కే శివ, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, ఎంపీడీఓ నాగేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు చేపట్టాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆలీఖాన్

నూజివీడు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులంతా వెంటనే గృహాల నిర్మాణాన్ని చేపట్టాలని ఎంపీడీఓ ఆలీఖాన్ సూచించారు. మండలంలోని తక్కులూరులో లబ్ధిదారుల వద్దకు శుక్రవారం ఎంపీడీఓ వెళ్లారు. గృహాల నిర్మాణాలు ప్రారంభించకపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. ఒక్కొక్క గృహానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలను ఉచితంగా ఇస్తోందని, రాయితీపై ఐరన్, సిమెంట్, ఇసుక ఇస్తోందని చెప్పారు. డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలను ఇప్పిస్తున్నందున వెంటనే గృహ నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు.

28న రక్తదాన శిబిరం

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో యువ భారత్ శక్తి పౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు పౌండేషన్ ఇన్‌చార్జి అవినాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 8.30 గంటలకు స్థానిక రామాలయం వద్ద క్యాంపు ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విశ్వనాథరావు ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో పౌండేషన్ సభ్యులు హర్షవర్ధన్ రెడ్డి, మిద్దె అఖిల్, చిట్టిబాబు, నరేంద్ర తదతరులు పాల్గొన్నారు

కర్రలతో విద్యుత్ వైర్లు తగిలించొద్దు

చాట్రాయి: రైతులు తమ పొలాల్లోని విద్యుత్ సర్వీసులను విద్యుత్ స్తంభం నుంచి తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొందరు రైతులు కర్రలు, దుంగలపై నుంచి విద్యుత్ సర్వీసులు తీసుకోవడం వల్ల గాలిదుమ్ములకు కిందపడి ఫెన్సింగ్ వైర్లపై పడుతుండడంతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. రైతులు త్వరతగతిన కర్రలు, దుంగలపై ఉన్న సర్వీసులను తొలగించి విద్యుత్ స్తంభాల నుంచి ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో సీఐ శ్రీను



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇబ్రహీంపట్నం: పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని ఇబ్రహీంపట్నం సీఐ పి.శ్రీను అన్నారు. గుంటుపల్లి జెడ్పీ పాఠశాల 1996–97 ఏడాది టెన్త్‌క్లాస్ విద్యార్థులు ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. సామాజిక కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శవంతంగా ఉంటాయని, సేవా భావం కలిగి ఉండటం శుభపరిణామం అన్నారు. రాబోయే రోజుల్లో సైతం సేవలు కొనసాగించాలని సీఐ సూచించారు. అప్పటి ఉపాధ్యాయురాలు శివ పార్వతి, సీఐ శ్రీనును సత్కరించారు. 2 వేల మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.

కూలింగ్ వాటర్, మజ్జిగ పంపిణీ

ముసునూరు: బలివే రామగుండాల చెరువు, ఈదుల చెరువులు, సప్‌లైచానల్స్‌లో చేపట్టిన ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ శుక్రవారం పరిశీలించారు. తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన కూలింగ్ మంచినీరు, మజ్జిగను కూలీలకు ఆమె అందజేశారు. ఎండలు పెరగడంతో బలివే శివారు గ్రామాలైన రంగంపేట, వెంకటాపురం గ్రామాల్లోని 300 మంది ఉపాధికూలీలకు గత 10 రోజులుగా చల్లని మంచినీరు, మజ్జిగ అందిస్తున్నట్టు చెప్పారు. ఉపాధి మేట్లు, కూలీలకు వడదెబ్బ తగలకుండా టెంట్లు వేయించడం, చల్లని మంచినీరు, మజ్జిగ అందించడం వంటి చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమాల్లో ఉపాధి హామీ సిబ్బంది, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

తిరువూరు: స్థానిక కృష్ణా హాల్ సెంటర్లో శుక్రవారం గుళ్ళపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం తిరువూరు వచ్చే ప్రజల సౌకర్యార్థం ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ వెంకటరత్నం తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు రెబ్బు నాగేశ్వరరావు (బూసి), మేకల నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి విశ్వరూప్‌తో చర్చ



మంత్రి పినిపే విశ్వరూప్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్ శుక్రవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. నూజివీడు విచ్చేసిన మంత్రి విశ్వరూప్‌కు ఎమ్మెల్యే ప్రతాప్‌తో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, రైతు సలహామండలి చైర్మన్ పల్లె రవీంద్రరెడ్డి, పలువురు కౌన్సిలర్లు స్వాగతం పలికారు.

శాంతియుతంగా జీవనం సాగించాలి

డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్

నూజివీడు: ప్రజలు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతియుత వాతావరణంలో జీవనం సాగించాలని నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ అన్నారు. స్థానిక ఎమ్మార్ అప్పారావు కాలనీలో శుక్రవారం రాత్రి పీస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పలు సూచనలు చేశారు. కాలనీలో నూతన వ్యక్తులు సంచరిస్తున్నా, గంజాయి అమ్మకాలు జరుగుతున్నా, ఇతర అసాంఘిక కార్యకలపాలు సాగుతున్నా వెంటనే పోలీసులకు తెలిపాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజలు కష్టపడి పనిచేసుకొని కుటుంబ భవిష్యత్ కోసం ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చక్కగా చదివించుకోవాలని సూచించారు. పట్టణ సీఐ ఏవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఆర్ అంకబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మస్తాన్, స్థానికులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ఆగిరిపల్లి: మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్టు మండల వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు అన్నారు. ఆగిరిపల్లి వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. 50 శాతం సబ్సిడీపై జనుము, జీలుగ, పిల్లిపెసర పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. రైతులు పట్టాదార్ పాస్ పుస్తకానికి అనుసంధానం అయిన ఆధార్ కార్డుతో బయోమెట్రిక్ విధానం ద్వారా విత్తనాలు పొందవచ్చన్నారు. ఆర్బీకేల్లో వీఏఏలు, వీహెచ్ఏలను సంప్రదించి విత్తనాలను రైతులు పొందాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, ఎంపీటీసీ గోపీనాథ్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దాసరి రామారావు, సభ్యులు రవిశేఖర్, రాజేష్, మైనార్టీ నాయకులు నాగుల్‌మీరా, రైతులు పాల్గొన్నారు.

తిప్పతీగ సాగుకు ప్రభుత్వం రాయితీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి హేమ

నూజివీడు: ఔషధ గుణాలు గల తిప్పతీగ సాగుకు ప్రభుత్వం రాయితీని ఇస్తోందని ఉద్యాన శాఖ అధికారిణి రాజులపూడి హేమ తెలిపారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో రైతులకు తిప్పతీగ సాగుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిప్పతీగ సాగుకు, శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ఎకరాకు రూ.లక్ష వరకు రాయితీని అందిస్తోందని హేమ తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వచ్చి తిప్పతీగ సాగును చేయవచ్చన్నారు. రైతు పరిమి ఏసుదాసు తిప్పతీగలో ఉండే ఔషధ గుణాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు హర్షియా, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

నూజివీడు: ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ ఎస్ఐ నూరాణి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని కోనేరుపేట అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ సహాయకురాలు (ఓపెన్ కేటగిరి), ఆగిరిపల్లి మండలం కృష్ణవరం-2లో అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్సీ) పోస్టులకు జూన్ 2న సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు స్థానికులై వివాహమై ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులు కావాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఇటీవల జారీచేసిన ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు జత చేయాలని తెలిపారు. సందేహాలుంటే ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

భూ సర్వే పనులు ప్రారంభం



తాతకుంట్లలో జగనన్న భూ సర్వే ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

విస్సన్నపేట: జగనన్న శాశ్వత భూ హక్కు,భూ రక్ష పథకం కింద భూ సర్వే పనులను శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని తాతకుంట్ల గ్రామంలో సర్వే నిర్వహించినట్లు డీటీ మోతీయా తెలిపారు. డ్రోన్ ద్వారా పూర్తిస్థాయిలో గ్రామంలో భూ సర్వే నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొద్దుటూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మేడా తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు షేక్ కాలీషా, వెంకన్న, సర్వే సిబ్బంది పాల్గొన్నారు. శనివారం మండలంలోని నరసాపురం గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షాపథకం సర్వే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: రైతుల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ ప్రభుత్వం పనిచేస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ మహానాడులో కొందరు టీడీపీ నాయకుల విమర్శలకు ఆయన స్పందించారు. దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కలల పంటలో భాగమైన పోలవరం ప్రాజెక్టులో అంతర్భాగమే చింతలపూడి ఎత్తిపోతల పథకమని, ఈ పథకానికి కూడా బడ్జెట్‌లో రూ.720 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే వసంత తెలిపారు. ఈ పథకం కూడా పూర్తయితే ఉమ్మడి కృష్ణాలోని మైలవరం, గన్నవరం, నందిగామ, ఏలూరు జిల్లాలోని నూజివీడు, సాగర్ ప్రాజక్టు ఆయకట్టు పరిధిలోని దాదాపు 58 వేల ఎకరాల చివరి భూములకు సాగునీటి సౌకర్యం కలుగుతుందన్నారు. భవిష్యత్ బడ్జెట్‌లో కూడా చింతలపూడికి అధిక ప్రాధాన్యమిస్తూ నిధులు కేటాయించి, తమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో వాణి వినిపించామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వివరించారు.